క్లుప్తంగా...

విద్యారంగ అభివృద్ధికి జీవితాంతం కృషి చేస్తా



అబిడ్స్: ఆటపా రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి కందికొండ శ్రీనివాస్‌కు ఉత్తమ టీచర్ అవార్డు లభించింది. లక్డీకాపూల్‌లోని ఆటపా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్‌తో పాటు పలువురు రాష్ట్ర నాయకులు అవార్డు గ్రహీత శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. నల్లమల్ల అటవీప్రాంతంలోని మన్ననూర్‌కు చెందిన శ్రీనివాస్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బెస్ట్ టీచర్ అవార్డు పొందడం గర్వకారణంగా ఉందని వారన్నారు. ఆటపా తరఫున హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ..జీవితాంతం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మంత్రిని కలిసిన లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



చార్మినార్: తెలంగాణలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులకు వెంటనే బదిలీలు చేపట్టాలని టీజీసీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భాస్కర్ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం కలిసి కోరారు. డిగ్రీ కాలేజీ అధ్యాపకుల 2018 తర్వాత బదిలీలు జరుగలేదు. ఐదేళ్ల నుంచి బదిలీలు జరుగనందున వెంటనే టీచర్స్‌తో పాటు బదిలీలు చేప్పట్టాలని అతను మంత్రిని కోరారు. విద్యాశాఖ మంత్రి సానుకూలంగా స్పందించి త్వరగా నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్‌కుమార్, బీరయ్య, డాక్టర్ అడవి రాజు ఉన్నారు.

ఓటు నమోదు చేయించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభించిన బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నరహరిచారి

జియాగూడ: అర్హులందరూ ఓటు నమోదు చేయించుకోవాలని జియాగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నరహరిచారి అన్నారు. ఆదివారం జియాగూడలోని శాంతినగర్‌లోని శ్లోకా స్కూల్‌లో పోలింగ్ స్టేషన్ 15, 16, 17, 18 బూత్‌ల పరిధుల్లోన్ని 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోజ్‌కుమార్, రఘునాథ్, అంగన్‌వాడీ టీచర్లు పునిత, కృష్ణవేణి, భాగ్యరేఖ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



టోలిచౌకి డీసీఎం అడ్డా వద్ద నిలిచిన వర్షం నీరు

గోల్కొండ: శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. టోలిచౌకి, గోల్కొండ, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. టోలిచౌకి చౌరస్తా వద్ద గల డీసీఎం అడ్డా వద్ద సుమారు రెండు అడుగుల వర్షం నీరు చేరింది. అదే విధంగా వరదనీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్న టూమ్స్ రోడ్, ఎండీ లైన్స్ తదితర ప్రాంతాల్లో పైపులు వేయడానికి చేసిన తవ్వకాల వద్ద కూడా వర్షం నీరు చేరింది. రోడ్డుపై మట్టి కుప్పలు కాస్తా వర్షానికి బురదమయంగా మారింది.

ముగిసిన 'దక్షిణ మధ్య క్షేత్ర ఖేల్ ఖూదో' పోటీలు

బండ్లగూడ: విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొన్నప్పుడే విజ్ఞానవంతులుగా ఎదుగుతారని విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ నాగేశ్వరరావు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదాధామంలో రెండ్రోజులుగా నిర్వహిస్తున్న విద్యాభారతీ దక్షిణ మధ్య క్షేత్ర ఖేల్ ఖూదో పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో విద్యాభారతీ దక్షిణ మధ్య క్షేత్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గెలుపొందిన టీమ్‌లకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శరీరం, మనస్సు ఆరోగ్యంగా ఉంటనే ఏదైనా సాధించవచ్చన్నారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యా భారతీ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, సహ కార్యదర్శి వాసిరెడ్డి వినోద్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

- బురదమయంగా మహ్మదీ లైన్స్ చౌరస్తా–మోతీదర్వాజ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా మారిన టోలిచౌకి టూమ్స్ రోడ్డు-గెలాక్సీ రోడ్డు

గోల్కొండ: మహ్మదీ లైన్స్ చౌరస్తా–మోతీదర్వాజ రోడ్డు ఆరు నెలలుగా అధ్వానంగా తయారయ్యింది. పైప్‌లైన్ పనుల కారణంగా రోడ్లపై తవ్వకాలు, తవ్విన మట్టి గుట్టల్లాగా పడి ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా గెలాక్సీ థియేటర్ నుంచి టూమ్స్ రోడ్‌కు వెళ్లేదారి కూడా పూర్తిగా అధ్వానంగా మారింది. డ్రైనేజీల మరమ్మతులు, ఇతర పనుల కారణంగా గతంలో ఈ రోడ్డును తవ్వేశారు. వాహనాల రాకపోకలకు రోడ్డు మరింత అధ్వానంగా తయారయ్యింది. దీనికి తోడు ఈ రోడ్డుపై డ్రైనేజీ నీరు కాలువలాగా ప్రవహిస్తుంది. అసలే మట్టి రోడ్డుగా తయారైన ఈ రోడ్డు డ్రైనేజీ నీరు ప్రవాహం కారణంగా బురద రోడ్డుగా మారింది. మరోవైపు గోల్కొండ కంపెనీ బాగ్, టోలిచౌకి చౌరస్తా–అక్బర్‌పురా రోడ్డుపై సైతం జరుగుతున్న పైప్‌లైన్ పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ పక్కన రోడ్డు తవ్వకాలతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. ఈ విషయాలన్ని పట్టించుకోని మంత్రులు మాత్రం అభివృద్ధి చేస్తున్నామంటూ ప్రకటనలు ఇస్తున్నారు.

కేసీఆర్ హయాంలో అన్ని రంగాల్లో తెలంగాణ టాప్



నందకిశోర్ వ్యాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన డాక్టర్ వెంకటేష్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే నెంబర్:1గా తయారయ్యిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, టూరిజం, ఐటీ రంగాలతో పాటు పలు రంగాలను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జోరుగా అభివృద్ధి చెందాయన్నారు. గోడేకబర్ ప్రాంతంలో వెంకటేశ్వర డయోగ్నస్టిక్ సెంటర్‌ను నందకిశోర్ వ్యాస్ బిలాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్య సేవలు అందిస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, ఆనంద్‌సింగ్, పప్పుమాత్రే, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి



మాట్లాడుతున్న కాటం నర్సింగ్ యాదవ్

నాంపల్లి: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులనే గెలిపించాలని, ఆ దిశగా బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి రావాలని కోరారు. బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బంజారా ఫంక్షన్ హాల్‌లో 'రాజ్యాధికారం కోసం బహుజనుల సమరభేరి'అనే కార్యక్రమం జరిగింది. బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు కాటం నర్సింగ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు పల్లపు గోవర్ధన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామన్‌గౌడ్, సీనియర్ నేత అమగడ్డ శివ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాటం నర్సింగ్‌యాదవ్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక శాతం లేని కులాలు రాజ్యాధికారంలోకి వస్తుంటే బీసీలు మాత్రం వారికి ఓట్లు వేసే యత్రాలుగానే మిగిలిపోతున్నారని తెలిపారు. బీసీలు ఈ విధానానికి స్వస్తి పలికి రాజ్యాధికారంలోకి వచ్చేలా తాపత్రయం పడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి ఎనభై లక్షల మంది బీసీలు ఉన్నట్లు వివరించారు.

ఉమ్రా యాత్ర పవిత్రమైనది

గోల్కొండ: ఉమ్రా యాత్ర ఎంతో పవిత్రమైనదని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఉమ్రా యాత్రకు ఆదివారం బయలుదేరి వెళ్లిన మిర్ తౌఫిక్ అలీని గోల్కొండ రిసాలబజార్‌లో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. ఉమ్రా యాత్రకు వెళ్లాలనేది ప్రతి ముస్లిం కోరిక అని అయితే కొందరికి మాత్రమే ఈ అవకాశం దేవుడు ఇస్తాడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌ఖదీర్, ఖాజాభాయ్ తదితరులున్నారు.



మీర్ తౌఫిక్ అలీని సన్మానిస్తున్న దృశ్యం

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి



జియాగూడ: ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జియాగూడలోని 2బీహెచ్‌కే కాలనీ వద్ద జియాగూడ బీజేపీ దళితమోర్చా ఉపాధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌యాదవ్, తులసిదాస్, ప్రేమ్‌కుమార్, రామ్‌కుమార్, రేపాక సంతోష్, రాజ్‌పోల్, దొర్తుల నరేష్, వెంకటేష్, నర్సిములు, సూరజ్, రాహుల్, శ్రవణ్, ధినేష్, భాస్కర్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

సిటీ కళాశాలకు మూడు ఉత్తమ అధ్యాపక పురస్కారాలు



డా.ఎల్.తిరుపతి



డా.ఆది రమేశ్ బాబు



ఎస్.రుూనీస్ రాణి

చార్మినార్: జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులకు పురస్కారాలు ప్రకటించింది. ఇందులో సిటీ కళాశాల అధ్యాపకులు ముగ్గురు పురస్కారాలకు ఎంపికయ్యారు. ఎంపిక చేసిన అధ్యాపకులకు సెప్టెంబరు 5వ తేదీ రవీంద్ర భారతిలో జరిగే వేడుకలో రూ.10 వేల నగదుతోపాటు సర్టిఫికెట్, మెడల్ అందజేసి సన్మానించనున్నారు. సిటీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఆంగ్లం, కామర్స్ విభాగాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ తిరుపతి రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు, డా. ఆది రమేష్ బాబు ఆంగ్ల విభాగం అధ్యక్షుడు, డా. ఎస్.రుూనీస్ రాణి కామర్స్ అధ్యాపకురాలు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. గత సంవత్సరం లాగానే ఈసారి కూడా కళాశాలకు మూడు ఉత్తమ అధ్యాపక పురస్కారాలు రావటం పట్ల ప్రిన్సిపాల్ ఆచార్య .పి. బాల భాస్కర్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం సంతోషం వ్యక్తం చేశారు.

ప్రణాళికాబద్ధంగా పార్కుల అభివృద్ధి



ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్

సైదాబాద్: పార్కుల్లో పచ్చదనం పెంచడం ద్వారా వాటిల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటోందని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో ఇంటర్ లాకింగ్ టైల్స్ ఏర్పాటు తదితర అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఐఎస్ సదన్‌లోని అన్ని కాలనీల్లోని పార్కులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కుల్లో పచ్చదనం పెంపుతో పాటు వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు పార్కుల్లో చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన క్రీడా పరికరాలు ఏర్పాటు చేయించామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, రఘు, సోమయ్య, సుధీర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నాటకాలతో సామాజిక చైతన్యం

గన్‌ఫౌండ్రీ: నాటకాలు సమాజంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించాయని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాణోదయ నాట్యమండలి (సురభి) 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాయాబజార్ అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాట్యమండలి అధ్యక్షుడు ఆర్.నాగబాబు, కార్యదర్శి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తుతెలియని రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబిడ్స్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలియా కళాశాల బస్టాప్ వద్ద లభ్యమైంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బస్టాప్ సమీపాన వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు డ్యూటీలో ఉన్న పోలీసులు విశాల్, అయ్యప్ప గుర్తించి ఫిర్యాదు చేశారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 40–45 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నాంపల్లి: మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి పది ఇంజెక్షన్లపాటుగా రూ.వెయ్యి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర పర్భనీ ప్రాంతానికి చెందిన షేక్ అర్షద్ ముంతాజుద్దీన్(23) చాంద్రాయణగుట్టలోని ఎంఐఎంఎస్ కళాశాలలోని సెంటర్ సర్వీస్ స్టెరిలైజేషన్ విభాగంలో ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ డిప్లొమా కోర్సు చేస్తూ మల్లేపల్లిలోని హ్యూమానిటీ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్‌గా విధుల్లో చేరాడు. థియేటర్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నప్పుడు టర్మిన్ బ్రాండ్ పేరుతో లభించే మెఫెంటెర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్ల గురించి పూర్తి అవగాహన పొందాడు. ఈ ఇంజెక్షన్లు శస్త్ర చికిత్సల సమయంలో, గుండె సంబంధిత సమస్యలలో అత్యవసర ఔషధంగా ఉపయోగిస్తారు. ఈ క్రమంలో నిందితుడు ఆస్పత్రి యాజమాన్యానికి తెలియకుండా థియేటర్‌లోనే కొన్ని మందు సీసాలను దొంగలించి బయట విక్రయించి సొమ్ము చేసుకోవాలనే దురాశ పుట్టింది. టెక్నీషియన్ హోదాలో శస్త్ర చికిత్సలకు అవసరమైన ఆర్డర్లను రోగుల నుంచి రెట్టింపు చేసేవాడు. రోగులు తెచ్చిన మందు సీసాలను అక్రమ మార్గంలో మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారికి ఒక్కో సీసాను రూ.1000 నుంచి రూ.2000 వరకు విక్రయించేవాడు. ఇలా పది మందికి పైగా విక్రయించాడు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుదీన్ అన్నారు. ఆదివారం ఆయన మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్, బీసీ రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఆ విషయం తన దృష్టికి తెస్తే వారికి సరైన సలహాలు, సూచనలు ఇచ్చి వారి దరఖాస్తులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటాయన్నారు. ప్రభుత్వం మైనార్టీలు, దళితులు, బీసీలకే కాకుండా దివ్యాంగుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. చాలా మందికి ఈ సంక్షేమ పథకాల వివరాలు తెలియవని ఆయన పేర్కొన్నారు. తమ ఏరియాలోని మజ్లిస్ నాయకులకు గానీ సంబంధిత కార్యాలయాలకు గానీ వెళ్లి సంక్షేమ పథకాల వివరాలు తెలుసుకోని అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా కార్వాన్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన అన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



మంత్రి తలసానికి సమస్యలు వివరిస్తునన ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే కోటాది రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రి తలసానికి వినతిపత్రం ద్వారా బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. నగరంలో నిరుపేదలకు డబుల్‌బెడ్ రూమ్‌లు పంపిణీ ప్రారంభించామన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా మంత్రి తలసాని సహకారంతో పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సురేష్, రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

గోల్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని జూబ్లిహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన షేక్‌పేట్‌లో ఇంటింటికీ తిరిగి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ఆయన స్థానికులను కోరారు. ఆయన వెంట షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ తదితరులున్నారు.



'బీఆర్ఎస్ అనుచరులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు'



విక్రమ్‌గౌడ్

అబిడ్స్: డబుల్ బెడ్‌రూమ్‌లను బీఆర్ఎస్ అనుచరులకే బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించడం దారుణమని రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ ఆరోపించారు. కేవలం బీఆర్ఎస్ శ్రేణులుగా చలామణి అవుతున్నవారికే అధికశాతం డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇచ్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం విక్రమ్‌గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. నగరంలో కేవలం 11,700 మందికి మాత్రమే డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోనే పేదలకు, బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇవ్వాలని విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న సౌత్‌జోన్ అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్

గౌలిపుర: తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య సూచించారు. ఇటీవల మొగల్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు గ్రూపుల యువకుల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో శనివారం రాత్రి ఆయన పోలీస్ స్టేషన్‌ను సందర్శించి మొగల్‌పుర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి తగిన సూచనలు, సలహాలు చేశారు. అనంతరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయాన్ని అనవసరంగా వృథా చేసుకోకుండా క్రమశిక్షణతో విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు అనే విషయాలపై కన్నేసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్‌జోన్ అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, చత్రినాక ఏసీపీ జీ.రమేష్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

గన్‌ఫౌండ్రీ: బుర్రకథలతో సమాజాన్ని మేల్కొలిపిన గొప్ప వ్యక్తి పాలడుగు నాగయ్య అని తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక, పాలడుగు నాగయ్య కళాపీఠం ఆధ్వర్యంలో రచయిత పి.సరోజినీదేవి రచించిన పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం, సరోజినీదేవి కుసుమాలు అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ స్ఫూర్తిని నాటకరూపంలో ఎంతో వ్యాప్తి చేశారని, ఆయన సాహిత్యాన్ని నేటి తరానికి అందించడం అభినందనీయమన్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, కేంద్ర సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యులు నాళేశ్వరం శంకరం, నేటి నిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాస్, పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వెంకటనర్సమ్మ, దర్పణం సాహిత్య వేదిక అధ్యక్షులు ఆర్.సూర్యప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి సీతాలక్ష్మి పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీదేవి తదితరులు

నేడు ఖాజాగూడలో బోనాలు

రాయదుర్గం: ఖాజాగూడలో కాటమయ్యస్వామి బోనాల వేడుకలను సోమవారం నిర్వహించేందుకు కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఖాజాగూడలోని కాటమయ్య దేవాలయం వద్ద సాయంత్రం 5 గంటలకు బోనాల వేడుకలు, తొట్టెల ఊరేగింపు ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

రాయదుర్గంలో ప్రత్యేక క్యాంపెయిన్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని జీహెచ్ఎంసీ భవనంలో ఆదివారం బీఎల్ఓలు, జీహెచ్ఎంసీ అధికారుల ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలలో బీఎల్ఓలు, అధికారులు అందుబాటులో ఉండగా పలువురు వచ్చి తమ పేర్లతో పాటు తప్పొప్పులను సరి చేసుకున్నారు.